సాక్షి తూర్పుగోదావరి

సోమవారం । 31 । మార్చి । 2025



దీక్ష ముగిసె.. దువా ఫలించె!

పవిత్ర రంజాన్ మాసం నేటితో ముగియనుంది. ఆదివారం సాయంత్రం చంద్ర దర్శనంతో ముస్లింలు ఈద్ నమాజ్‌కు సిద్ధమయ్యారు.


8లో



సీఆర్సీ సేవలు ఎనలేనివి

కళలను, కళాకారులను ప్రోత్సహించేందుకు సీఆర్సీ చేస్తున్న కృషి అభినందనీయమని సినీ నటులు తనికెళ్ల భరణి, గౌతంరాజు, గుండు సుదర్శన్, జోగినాయుడు అన్నారు.

డెల్టా కాలువలకు 10,700 క్యూసెక్కులు



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 10,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3200, మధ్య డెల్టాకు 2000, పశ్చి మ డెల్టాకు 5,500 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

పీ4 ప్రారంభోత్సవానికి బయలుదేరిన బస్సులు



బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా నుంచి 13 బస్సులు ద్వారా ఐదు వందల మంది బయలుదేరి వెళ్లినట్టు కలెక్టర్ పి. ప్రశాంతి తెలియజేశారు. ఆనం కళాకేంద్రం ఆవరణలో విజయవాడ బయలుదేరి వెళుతున్న బస్సులకు జెండా ఊపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు.

రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ నరసింహకిషోర్



రాజమహేంద్రవరం రూరల్: ముస్లిం సోదర,సోదరీ మణులకు, ముస్లిం పోలీసు అధికారులకు, సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ రంజాన్ పండగ సందర్భంగా ఈద్‌ముబారక్ ఓ ప్రకటనలో తెలిపారు. 30రోజుల పాటు కఠిన ఉపవాస దీక్ష చేసిన ముస్లిం సోదర,సోదరిమణులందరూ సుఖసంతోషాలతో రంజాన్ పండగను జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

పోక్సో తరహా చట్టాల ద్వారా మహిళల సంరక్షణ

కోరుకొండ: పోక్సో, తదితర చట్టాల ద్వారా మహిళలకు సంరక్షణ జరుగుతోందని, దాన్ని మహిళలు వినియోగించుకోవాలని రాజమహేంద్రవరం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎం.జగదీశ్వరి అన్నారు. స్థానిక హైస్కూల్‌లో ఆదివారం చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన జడ్జి బాలికలు ఎవరి ప్రలోభాలకు లొంగకూడదని, లైంగిక వేధింపులకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అన్నవరం దేవస్థానం అర్చకుడికి ఉగాది పురస్కారం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం సీనియర్ ఉప ప్రధాన అర్చకుడు చిట్టెం వీవీఎస్ఎస్ హరగోపాల్ రాష్ట్ర ప్రభుత్వ శ్రీవిశ్వావసు ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. విజయవాడలో ఆదివారం రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఉగాది వేడుకల్లో ఆయనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉగాది పురస్కారాన్ని అందజేశారు.

ఘనంగా శ్రీ విశ్వావసు నామ ఉగాది వేడుకలు

- సంప్రదాయ కార్యక్రమాలతో ఆద్యంతం ఆకట్టుకున్న కార్యక్రమాలు
- పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): తూర్పు గోదావరి జిల్లాలో శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రం వేదికగా జిల్లా యంత్రాంగం, జిల్లా సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శ్రీ విశ్వావసు నామ ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఆర్ట్స్ కళాశాల సహాయ లెక్చరర్ పసుమర్తి శ్రీనివాస శర్మ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. తొలుత సభా ప్రాంగణానికి చేరుకున్న అతిథులకు స్వాగత సత్కారం శుభ మంగళ నాదస్వరం కే.వెంకటేశ్వరులు, డోలు వై.ఎస్.వి.సత్యనారాయణ, కే.సందీప్ తాళం, జి.భరత్ శృతి లచే నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథులు జ్యోతి వెలిగించారు. కలెక్టర్ పి.ప్రశాంతి, శ్రీ పురాణ పండ జయలక్ష్మి, మాధవ, అధ్యాపకులు, వారి శిష్య బృందం వేద పఠనం, మహదాశీర్వచనం చేశారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా పంచాంగ పఠనాన్ని సిద్ధాంతి ఏవీడి. శ్రీనివాసులు చేశారు. ఉగాది పండగ సందర్భంగా వసంత కవితా గానం, కవి సమ్మేళనం నిర్వహించారు. శ్రీ ఆచార్య బులుసు వెంకట సత్యనారాయణ సమన్వయకర్త వ్యవహరించారు. శ్రీ విజయ శంకర ప్రభుత్వ సంగీత కళాశాల బృందం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. వేద పండితులకు , పంచాంగకర్తలకు, కవులు కళాకారులకు సత్కారం నిర్వహించారు.


ఉగాది వేడుకలలో నిర్వహించిన నృత్య ప్రదర్శన →



ఇది కూడా పాయె!

- జాడ లేని చంద్రన్న బీమా
- పథకాన్ని అటకెక్కించిన కూటమి ప్రభుత్వం
- రూ.10 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి పైసా కూడా ఇవ్వని వైనం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ బీమా సక్రమంగా అమలు
- పేరు మార్చారు తప్ప అమలు లేదు
- వేలాదిగా పెండింగ్‌లో ఉన్న క్లైములు

పిఠాపురం: సూపర్ సిక్స్ పథకాలు అంటూ ఎన్నికలకు ముందు చెప్పిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఇప్పుడు వాటి అమలు మాట ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలోనే చంద్రన్న బీమా పథకాన్ని అటకెక్కించారు. గత ప్రభుత్వంలో వైఎస్సార్ బీమా పేరుతో ఈ పథకం సక్రమంగా అమలు చేయగా చంద్రబాబు ఎన్నికల సభల్లో గత ప్రభుత్వాన్ని విమర్శిస్తూ చంద్రన్న బీమాను మళ్లీ అమలు చేస్తామని, రూ.5 లక్షల ఉన్న పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచి అందజేస్తామని చెప్పుకొచ్చారు. కానీ ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు గడుస్తున్నప్పటికీ నేటికీ చంద్రన్న బీమా పథకం అమలుపై ఎటువంటి కదలిక లేకపోవడంపై పలువురు బీమా బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ పథకాన్ని ప్రభుత్వం మళ్లీ అమలు చేయబోతోందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గతేడాది జూన్‌లోనే అమరావతిలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో చెప్పారు. కానీ నేటికీ ఈ పథకంపై స్పష్టత లేకపోవడం గమనార్హం. అయిన వారిని కోల్పోయిన మీకు నేను అండగా ఉంటా, రూ.5లక్షలు కాదు రూ.10 లక్షలు పరిహారం ఇస్తా అంటూ ఎన్నికల్లో హామీలతో ఊదరగొట్టిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యాక ఏరు దాటాక తెప్ప తగలేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయిన వారిని కోల్పోయి ఆధారం లేక బీమా కోసం ఎదురుచూస్తున్న బాధితులకు కూడా మొండి చెయ్యి చూపించారు. ఎన్నికల్లో చంద్రన్న బీమా పథకం అమలు చేస్తామని పరిహారాన్ని పెంచి పంపిణీ చేస్తామని ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చాక అటకెక్కించేశారు. పెంచడం మాట అటుంచితే అసలు కూడా ఇవ్వకపోవడంతో బాధితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 8 వేల క్లైములు పెండింగ్‌లో ఉండగా ప్రస్తుతం కనీసం దరఖాస్తులు కూడా స్వీకరించడం లేదు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం అనే మాటే పక్కన పెట్టేశారు.

బీమా ఇలా ఇవ్వాలి..

చంద్రన్న బీమా పథకంలో భాగంగా 18–50 ఏళ్ల లోపు వారు సహజ మరణం పొందితే రూ.లక్ష, ప్రమాదవశాత్తూ మృతి చెందినా శాశ్వత వైకల్యం పొందినా రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేస్తారు. 51–70 ఏళ్ల లోపు వారు ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.3 లక్షలు చొప్పున అందిస్తారు. ప్రమాదంలో పాక్షిక వైకల్యం పొందిన వారికి రూ.2.50 లక్షలు అందజేస్తారు. అయితే వ్యక్తి మృతి చెందిన తరువాత బాధిత కుటుంబానికి 30 రోజుల్లోగా పరిహారం అందాల్సి ఉంది. సహజ మరణం పొందిన వ్యక్తి వివరాలను 7 రోజులు, ప్రమాదాలకు గురైతే 15 రోజుల్లోపు సచివాలయాల్లో నమోదు చేయించాలి. బీమా సభ్యుడిగా ఉన్న వ్యక్తి చనిపోతే వెంటనే రూ.10 వేలు మట్టి ఖర్చుల కింద అందజేయాలి. మిగిలిన మొత్తాన్ని నామినీ వ్యక్తి గత బ్యాంకు ఖాతాకు జమ చేస్తారు.

బాధిత కుటుంబాల ఎదురుచూపులు ఎన్నాళ్లో..

ఇలా నెలలు తరబడి క్లైములు పరిష్కారం కాకపోవడంతో బాధిత కుటుంబాలకు నేటికీ బీమా సొమ్ము కోసం నిరీక్షణ తప్పడం లేదు. ఉదాహరణకు కాకినాడ జిల్లా తొండంగి మండలం శృంగవక్షం గ్రామానికి చెందిన సుంకర శివాజీ, పెద్దాపురం మండలం గుడివాడకు చెందిన తోట లక్ష్మి మరణించి నెలలు గడుస్తున్నా వీరికి ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం నేటికీ అందలేదు. కిర్లంపూడి మండలం ఎస్.తిమ్మాపురానికి చెందిన మొగిలి దుర్గయ్య, కరప మండలం గొర్రిపూడి గ్రామానికి చెందిన గుత్తుల వరలక్ష్మి సహజ మరణం పొందగా వీరికి రూ.లక్ష పరిహారం నేటికీ అందలేదు. ఇలా అనేక మంది బీమా పథకంలో పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. వాస్తవానికి 30 రోజుల్లోపే బీమా పరిహారం సొమ్ము బాధిత కుటుంబాలకు అందాల్సి ఉంది. ఇంటి పెద్దను, ఆసరా అందించే వారిని కోల్పోయి కుటుంబాల పోషణ కష్టంగా మారిన పరిస్థితుల్లో ప్రభుత్వం అందిస్తున్న ఈ సొమ్ము వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. కాని కూటమి ప్రభుత్వం బాధితుల ఆర్తనాదాలు వినకుండా హామీని తుంగలో తొక్కి అంత చేస్తున్నాం ఇంత చేస్తున్నాం అంటూ ప్రచారాలు మాత్రం చేసుకుంటోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇంకా మార్గదర్శకాలు రాలేదు

ఎవరైనా సాధారణ, ప్రమాదానికి గురైన మరణాలు జరిగితే వెంటనే సచివాలయాల్లో నమోదు అవుతున్నాయి. అయితే కూటమి ప్రభుత్వం పరిహారాన్ని పెంచి అమలు చేసేందుకు చర్యలు తీసుకుంది. త్వరలోనే పెండింగ్ క్లైములతో పాటు కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన క్లైములు కూడా పరిష్కారమయ్యే అవకాశం ఉంది. అయితే ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎటువంటి విధివిధానాలు మాకు అందలేదు.

– ఎ.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ, కాకినాడ జిల్లా

అటకెక్కిన చంద్రన్న బీమా

చంద్రన్న బీమా పథకంలో భాగంగా ప్రమాదవశాత్తూ మరణించిన వ్యక్తికి రూ.10 లక్షలు ఇస్తామన్న హామీకి కట్టుబడి ఉన్నామని గతేడాది ఆగస్టులో అధికారులతో జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పుకొచ్చారు. కానీ ఈ పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తామనేది నేటికీ ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతేడాది జూన్ నుంచి ఇప్పటి వరకు సుమారు 8 వేల క్లైములు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. అయితే వీటిని ప్రభుత్వం నమోదు చేసుకోవడం లేదు. సహజ మరణం పొందినా, ప్రమాదవశాత్తూ మరణించినా స్థానిక సచివాలయాల్లోనే సమాచారాన్ని సేకరిస్తున్నారు. కానీ ఎటువంటి బీమా పరిహారం అందడం లేదు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇలా..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 2021–22లో 1,764 క్లైములకు గానూ 1,410 సెటిల్ కాగా 354 ఇంకా పరిష్కారం కాలేదు. 2022–23లో 1,750 క్లైములకు 1,680 సెటిల్ కాగా 70 ఇంకా పరిష్కారం అవ్వలేదు. 2023–24 లో 1,537 క్లైములకు 1,052 సెటిల్ కాగా ఇంకా 485 పరిష్కారం కావాల్సి ఉంది. మొత్తంగా 2021 నుంచి గతేడాది జూన్ వరకు 4,336 సాధారణ మరణాలు జరగగా వీటిల్లో 3,786 సెటిల్ అయ్యాయి. ఇంకా 550 పరిష్కారం అవ్వాల్సి ఉంది. ప్రమాదవశాత్తూ 715 మంది మరణించగా 356 సెటిల్ అయ్యాయి. ఇంకా 359 క్లైములకు పరిష్కారం అవ్వాల్సి ఉంది. పెండింగ్‌లో ఉన్న క్లెయిములు పరిష్కరించే లోపు ఎన్నికల హడావుడి ప్రారంభం కావడంతో వైఎస్సార్ బీమా పథకం ఎన్నికలకు ముందు నిలిచిపోయింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడేళ్లలో సుమారు రూ.25 కోట్ల వరకు పరిహారం అందజేశారు.

రత్నగిరిపై భక్తుల రద్దీ



సత్యదేవుని దర్శనానికి క్యూ లో నిల్చున్న భక్తులు

అన్నవరం: విశ్వావసు నామ ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం సత్యదేవుని ఆలయం వేలాదిగా విచ్చేసిన భక్తులతో కిటకిటలాడింది. ఉగాది పర్వదినం ఆదివారం, రంజాన్ పండగ సందర్భంగా సోమవారం వరుసగా రెండ్రోజులు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు సెలవు కావడంతో సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. సత్యదేవుని దర్శనానికి రెండు గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట సమయం పట్టింది. స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

కాకినాడ సిటీ: వలంటీర్ల రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కాకినాడ కలెక్టరేట్ వద్ద తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ధర్నా నిర్వహించారు. వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.10 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేడు అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం గత సంవత్సరం ఇదే ఉగాది రోజున తీపి కబురు చెబుతున్నామని చెప్పి వలంటీర్లను కొనసాగిస్తామని, రూ.5 వేలు కాదు, రూ. 10 వేలు వేతనం ఇస్తానని ఆనాడు హామీ ఇచ్చారని ఆందోళనకారులు వివరించారు. కానీ నేడు ఆ హామీని మరిచి వలంటీర్లను రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిది నెలల నుంచి వలంటీర్లను గాల్లో పెట్టి వారికి బకాయి వేతనం చెల్లించకుండా ఇంటికి పంపించేశారన్నారు. తక్షణమే వలంటీర్ల బకాయి వేతనాలు చెల్లించి వారిని విధుల్లోకి తీసుకుని రూ.10 వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్ కూడా నా ఆడపడుచులకు రూ.5 వేలు ఏమి సరిపోతాయని, రూ.10 వేలు ఇస్తామన్నారని, ఇప్పుడు పది నెలలుగా ఆడపడుచులకు ఇచ్చిన హామీని మరచి పాలన సాగిస్తున్నారన్నారు.

భూమికి మేలు-రైతుకు వీలు



ఉసులుమర్రులో రైతులకు నవరత్న కిట్లను అందిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది



నవధాన్యాల పంటలను పరిశీలిస్తున్న జిల్లా ప్రకృతి వ్యవసాయ కో ఆర్డినేటర్ రామకృష్ణ, సిబ్బంది

- నవధాన్యాల పంటలతో ఉపయోగం
- పెట్టుబడి తక్కువ – ఆదాయం ఎక్కువ
- మూడవ పంటగా వేసేందుకు 102 గ్రామాల ఎంపిక
- జిల్లాలో 40 వేల ఎకరాల్లో సాగుకి సిద్ధం

పెరవలి: జిల్లాలో సేంద్రియ సాగు పెంచే దిశగా జిల్లా అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. రబీ తరువాత నవధాన్యాల సాగుకు రంగం సిద్ధం చేశారు. అందులో భాగంగా గత ఏడాది 30 వేల ఎకరాల్లో నవధాన్యాల పంటలను వేస్తే ఈ ఏడాది 40 వేల ఎకరాల్లో, 39 వేల మంది రైతులతో సాగు చేయించటానికి సిద్ధపడుతున్నారు. అందుకు 30 రకాల నవరత్న ధాన్యాలను కిట్లను తయారు చేసి రైతులకు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఒక్కో కిట్టు రూ.800 నుంచి రూ.900 విలువ ఉంటుంది. ఈ ధాన్యాలను రైతులకు అందించి సాగు చేయటానికి జిల్లాలో 102 గ్రామాలను ఎంపిక చేశారు. డ్వాక్రా ద్వారా రూ.1.30 కోట్ల రుణం తీసుకుని కిట్లు తయారు చేశారు. ఇప్పటి వరకు జిల్లాలో 3 వేల కిట్లు తయారు చేశారు. రైతులకు 500 కిట్లు అందజేశారు. దీనివల్ల భూసారం పెరగటంతో పాటు రైతులకు పంటల ద్వారా లాభాలు రానున్నాయి.

లక్ష్యం ఇలా..

జిల్లాలో నవధాన్యాల పంటలను 40 వేల ఎకరాల్లో 39 వేలమంది రైతులతో సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఇందుకోసం వ్యవసాయ అనుబంధ శాఖలతో పాటు వెలుగు అధికారులు, వ్యవసాయాధికారులు, క్షేత్ర స్థాయిలో సేంద్రియ సిబ్బందితో కలసి పర్యటించి రైతులను సన్నద్ధం చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంలో నేలను సారవంతం చేసి, పెట్టుబడి ఖర్చు తగ్గించి, పంట దిగుబడి పెంచేలా దృష్టి సారించారు. ఈ లక్ష్య సాధనలో ఎంపిక చేసిన గ్రామానికి డ్వాక్రా ద్వారా రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షలు రుణం ఇప్పించి నవధాన్యాలను కొనుగోలు చేసి కిట్లను తయారు చేసి రైతులకు ఇప్పించేలా పథకం రూపొందించారు. ఈ నవధాన్యాల్లో ముఖ్యంగా పెసలు, పిల్లిపెసర, మినుము, జీలుగ, జనుము, కొర్రలు, సాములు, బొబ్బర్లు, కందులు, సజ్జలు, నువ్వులు ఇలా 30 రకాల నవనాధాన్యాల పంటలు వేసి రైతులకు లాభం చేకూరేలా చేసి, తద్వారా పంట భూములకు సారం అందించేలా ప్రణాళిక రచించారు. ఈ నవధాన్యాల పంటల వలన పశువులకు మేత, రైతులకు పంట లాభాలు, భూసారం పెంచేలా చర్యలు చేపట్టారు.

ఇవీ లాభాలు..

- జీవ వైవిధ్యం పెరుగుదల
- 365 రోజులు బహుళ పంటలతో నేల సారవంతం
- నేలలో సేంద్రియ కర్బన్ శాతం పెరుగుదల
- వివిధ పంటల సాగు వల్ల భూమిలో సూక్ష్మ జీవులకు ఆశ్రయం. తద్వారా ప్రధాన పంటకు పోషకాలు లభ్యం
- బహుళ పంటల వల్ల కలుపు ఉండదు, నేల కోతకు గురి కాదు
- నేల గుల్లబారి, వానపాముల వృద్ధి
- ప్రధాన పంటలను ఆశించే చీడ, పీడలను తట్టుకునే సామర్థ్యం
- నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుదల
- నవధాన్యాల పంటల వల్ల పశువులకు మేత లభ్యం
- బహుళ పంటల వలన అదనపు ఆదాయం
- రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గుదల
- భూసారంతో మేలైన పంట దిగుబడులు
- నేల స్వభావంలో మార్పు, స్థూల, సూక్ష్మ పోషకాల వృద్ధి


లాభాలు బాగు

నవధాన్యాల పంటల సాగుతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుంది. ఉదాహరణకు ఒక రైతు ఎకరం పొలంలో నవ్వులు సాగు చేపడితే ఎకరానికి దిగుబడి 250 నుంచి 300 కిలోలు వస్తుంది. ప్రస్తుతం మార్కెట్టులో ధర ప్రకారం కిలో రూ.250 చొప్పున 250 కిలోలకు రూ.62,500 వస్తుంది. ఇందులో ఖర్చులు, పెట్టుబడి పోను ఎకరానికి రూ.25వేలు మిగులు వస్తుంది. అదే మినుము సాగు చేపడితే ఎకరానికి దిగుబడి 400 నుంచి 700 కిలోలు వస్తుంది. మార్కెట్టులో ధర ప్రకారం క్వింటా ధర రూ.6వేలు చొప్పున 5 క్వింటాలకు రూ.30 వేల ఆదాయం వస్తుంది. పెసలు చూసుకుంటే ఎకరానికి దిగుబడి 500 నుంచి 600 కిలోలు వస్తుంది. మార్కెట్ రేటు ప్రకారం క్వింటాకి రూ.8వేలు చొప్పున రూ.40 వేలు వస్తుంది. ఇందులో ఖర్చులు పోగా సగం సొమ్ము రైతులకు మిగులుతుంది. ఈ పంటలు వల్ల ఎకరానికి పచ్చిరొట్ట రూపేణా 10 టన్నుల ఎరువు లభ్యం అవుతుంది.

జిల్లాలో సాగు విస్తీర్ణం ఇలా

గత సార్వాలో 30 వేల ఎకరాల సాగు	
రైతులు	28 వేలు
ప్రస్తుత లక్ష్యం 40 వేల ఎకరాలు	
రైతులు	39 వేలు
కిట్టు ధర రూ.800 నుంచి రూ.900	
సిద్ధం చేసిన కిట్లు	3వేలు
జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాలు	102
మొత్తం డ్వాక్రా రుణం	రూ.1.30 కోట్లు

రైతులకు అదనపు ఆదాయం



జిల్లాలో నవధాన్యాల సాగు విస్తీర్ణం 40 వేల ఎకరాలకు పెంచాలనే ఉద్దేశంతో వ్యవసాయ అనుబంధ శాఖల సహకారంతో ప్రణాళిక రూపొందించాం. ఇందులో భాగంగా జిల్లాలో 102 గ్రామాలు ఎంపిక చేశాం. ఆయా గ్రామాల్లో రైతులకు కిట్లు అందించి సాగు చేపడతాం. నవధాన్యాల సాగు వల్ల రైతులకు అదనపు ఆదాయం సమకూరడంతో పాటు పంట భూములకు ఎరువు లభ్యమవుతుంది. భూసారం పెరిగి ఖరీఫ్ సాగుకి భూమి అనుకూలంగా మారి దిగుబడి పెరుగుతుంది.

– తాతారావు, సేంద్రియ వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్, తూర్పుగోదావరి జిల్లా

అబద్ధపు వాగ్దానాలతో మోసం

కూటమి ప్రభుత్వ పాలనపై వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ. చిత్రంలో జక్కంపూడి రాజా, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రౌతు సూర్యప్రకాశరావు, మేడపాటి షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: ఎన్నికల్లో ఇచ్చిన అబద్ధపు వాగ్దానాలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను పేదరికంలోకి నెట్టేసిందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ ధ్వజమెత్తారు. ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకల సందర్భంగా రాజమహేంద్రవరం పార్లమెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తెలుగు సంవత్సరాది మొదలుగా ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కూటమి పాలనలో రైతులకు సుఖ సంతోషాలు కరవయ్యాయన్నారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో మొదటిసారిగా వైఎస్ రాజశేఖరరెడ్డి రైతులకు ఉచిత విద్యుత్తు, రుణమాఫీ పథకాలు ప్రవేశపెడితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు పంట వేసిన దగ్గర నుంచి విక్రయించే వరకు గిట్టుబాటు ధర అందించే చర్యలు చేపట్టారన్నారు. ఇన్నాళ్ల కూటమి ప్రభుత్వం పాలన పరిశీలించిన ప్రజలు జగన్ పాలనే భేష్ అని తేల్చేశారన్నారు. రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ పాలన చేపట్టిన కూటమి ప్రభుత్వం ఎన్నికలు వాగ్దానాలు అమలు చేయలేదన్నారు. ప్రజల పక్షాన పార్టీ తరఫున నిరంతరం పోరాటం సాగిస్తామన్నారు. రాష్ట్ర ప్రజలకు సుఖసంతోషాలతో ఉండాలని ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు సుభిక్షంగా ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలు వైఎస్సార్ సీపీ పక్షాన ఉన్నారన్నారు. కూటమి అబద్ధపు మాటలకు మోసపోయిన ప్రజలు తిరుగుబాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రజలతో కలసి సమస్యలపై పోరాటం చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, రాష్ట్ర హౌసింగ్ బోర్డు మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, పార్టీ నగర మాజీ అధ్యక్షుడు నందెపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

14 మంది జూదగాళ్ల అరెస్టు
వేర్వేరు చోట్ల కేసులు నమోదు


పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

పిఠాపురం: మండలంలో ఆదివారం జూదాలు ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎస్.రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం మండలం ఏకే మల్లవరంలో పేకాట ఆడుతున్న వారిపై దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.7130 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. గొల్లప్రోలు శివారు రైల్వే ట్రాక్ వద్ద కొంత మంది కోడిపందాలు ఆడుతున్నారన్న సమాచారంతో అక్కడికి వెళ్లి ఇద్దరిని అదుపులోకి తీసుకుని ఒక కోడిపుంజును, రెండు కత్తులను, వారి వద్ద నుంచి రూ.1060 స్వాధీనం చేసుకున్నారు. అలాగే చేబ్రోలు శివారులో కొందరు కోడి పందాలు ఆడుతున్నారన్న సమాచారంతో అక్కడ మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని, ఒక కోడిపుంజును, రెండు కత్తులతో పాటు, రూ.6940ల నగదును స్వాధీనం చేసుకుని వారందరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆరికిరేవుల, బంగారమ్మపేటల్లో..

కొవ్వూరు: ఆరికిరేవుల, బంగారమ్మపేటలో కోడిపందేలు ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టణ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఆరికిరేవులలో నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.600 నగదు, ఒక కోడి, ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నారు. బంగారమ్మపేటలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని సీఐ పి.విశ్వం తెలిపారు. వీరి నుంచి రూ.1,760 నగదు, కోడి, కోడి కత్తి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.నిందితులను అరెస్ట్ చేసినట్టు ఆయన తెలిపారు.

అప్పుల బాధతో గోదావరిలో దూకిన వ్యక్తి


బ్రిడ్జిపై పార్కు చేసిన కారు

అల్లవరం: అమలాపురం ఎర్రవంతెన హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన చోడపనీడి వెంకటేశ్వరరావు (62) అప్పుల బాధ తాళలేక ఆదివారం బోడసకుర్రు బ్రిడ్జిపై నుంచి వైనతేయ నదిలోకి దూకేశాడు. అమలాపురం నుంచి ఏపీ 16 డీఓ 222 నెంబర్ స్విఫ్ట్ కారుతో వచ్చి బోడసకుర్రు బ్రిడ్జిపై పార్కు చేసి ఆదివారం సాయంత్రం 7.30 సమయంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బ్రిడ్జిపై నుంచి వ్యక్తి దూకడాన్ని గుర్తించిన ప్రయాణికులకు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై తిరుమలరావు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వెంకటేశ్వరరావు అప్పుల బాధలు భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని ప్రాథమిక విచారణలో పోలీసులు తెలిపారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శిగా శ్రీదేవి



రాయవరం: బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శిగా రాయవరం మండలం వెదురుపాకకు చెందిన ఎం.శ్రీదేవి నియమితులయ్యారు. ఈ విషయాన్ని శ్రీదేవి ఆదివారం విలేకరులకు తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్‌కె మనోహరరావు ఈ మేరకు నియామకం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

దీక్ష ముగిసె.. దువా ఫలించె!

- నేడే ఈద్ ఉల్ ఫిత్ర్
- చంద్ర దర్శనంతో ముగిసిన ఉపవాసాలు
- సోమవారం ఈద్ నమాజ్
- ఈద్గాలు, మసీదుల్లో భారీ ఏర్పాట్లు
- ధన, ఆరోగ్యాలకు బీమా జకాత్
- పేదలూ పండగ చేసుకునేందుకు ఫిత్రా

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): పవిత్ర రంజాన్ మాసం నేటితో ముగియనుంది. ఆదివారం సాయంత్రం చంద్ర దర్శనంతో ముస్లింలు ఈద్ నమాజ్‌కు సిద్ధమయ్యారు. సోమవారం ఈద్ ఉల్ ఫితర్ పండగ చేసుకునేందుకు ఏర్పాట్లు చేశారు. నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు(రోజా), ప్రత్యేక తరావీహ్ నమాజ్, సహర్, ఇఫ్తార్లు, ఖురాన్ పఠనం, దానధర్మాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ముస్లింలు గడిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చుక్క నీరు తాగకుండా నిష్ఠతో దీక్షలు పాటించారు. చివరకు చంద్ర దర్శనం కావడంతో పండగ చేసుకోనున్నారు.

ఈద్ నమాజ్‌కు సిద్ధం

ఈదుల్ ఫితర్ నమాజ్ కోసం ఏర్పాట్లు చేశబూరు. ఈద్గాలతో పాటు మసీదుల్లో సౌకర్యాలు కల్పించారు. పండగ రోజు ముస్లింలు ఈద్గాలకు వెళ్లి ఈదుల్ ఫితర్ నమాజ్ చేయడం ఆనవాయితీ. నెల రోజుల తమ ప్రార్థనలు ఫలించాలని, సర్వ మానవాళి సంతోషంగా ఉండాలని కోరుతూ అల్లాహ్‌కు దువా చేస్తారు.

2.50 శాతం జకాత్

రంజాన్‌లో దాన ధర్మాలకు అధిక ప్రాధాన్యం ఉంది.


విద్యుత్ కాంతులతో ముస్తాబైన రాజమహేంద్రవరంలోని మసీదు

ధనికులే కాదు.. పేదలు సైతం ఆనందంగా పండగ చేసుకోవాలన్నదే ఈ మాసం ముఖ్యోద్దేశం. మనిషి ఆరోగ్యం, తాను సంపాదించిన ధనంపై అల్లా నిర్దేశించిన బీమాయే జకాత్, ఫిత్రా దానాలు. 52.5 గ్రాముల వెండి, 75 గ్రాముల బంగారం, అంతకు మించి విలువైన ధన/ఆస్తులు కలిగితే జకాత్‌కు అర్హులు. వాటి వెల లెక్కకట్టి 2.5 శాతం పేదలకు జకాత్ రూపేణా కచ్చితంగా ఇవ్వాల్సి ఉంటుంది. ఇది రంజాన్‌లో ఇస్తే 70 రెట్లు అధికంగా పుణ్యం లభిస్తుందనేది ముస్లింల విశ్వాసం.

సర్వం సిద్ధం

ప్రార్థనలకు ముందు మహా ప్రవక్త మొహమ్మద్(స.అ.వ.) సంప్రదాయ ప్రకారం ఖర్జూరం సేవించి, నూతన వస్త్రాలు ధరించి, అత్తరు రాసుసుని నమాజు కోసం ఈద్గాకు చేరుకుంటారు. అక్కడ ఈద్ నమాజ్ చదివి, అనంతరం పరస్పరం ఈద్ ముబరక్ చెప్పుకొంటారు. అల్లాహ్ నామాన్ని స్మరిస్తూ ఇంటి నుంచి ఈద్గాకు వెళ్లి, నమాజ్ పూర్తయ్యాక వేరే మార్గంలో ఇంటికి చేరుతారు. రంజాన్‌లో సేమియా పాయసం ప్రత్యేకం. బంధుమిత్రులకు ఇరుగు పొరుగువారికి సేమియా పాయసమిచ్చి తమ ఆత్మీయతను పంచుకుంటారు. చిన్న పిల్లలకు ఈద్ కానుకలు బహూకరిస్తారు. సోమవారం రాజమహేంద్రవరంలోని అన్ని మసీదులలో ఈదుల్ ఫిత్రని జరుపుకోవడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. రాజేంద్రనగర్‌లోని ఈద్గాలో ఈదుల్ ఫిత్ర్ నమాజును నిర్వహిస్తారు.

ఫిత్రా ఇవ్వాల్సిందే..

సాధారణ ముస్లిం రంజాన్ సందర్భంగా 2.6 కిలో గ్రాముల గోధుమలు, వరి(ప్రధాన ఆహార ధాన్యం), సమానమైన డబ్బు పేదలకు దానం చేయడమే ఫిత్రా. దీనిని ఆరోగ్య బీమాగా మత పెద్దలు చెబుతారు. పేదరికంతో పండగకు నోచుకోని నిరుపేద ముస్లింలకు ఫిత్రా దానమివ్వాలి. సద్ఖా-ఎ-ఫిత్రాతో ఆరోగ్య బీమాను అల్లాహ్ కల్పిస్తారంటారు. సూత్రప్రాయంగా ఈ ఏడాది మత పెద్దలు రూ.150 ఫిత్రా ఇవ్వాలని సూచించారు. దీనికంటే ఎక్కువ ఇవ్వవచ్చు కానీ తగ్గించరాదు. పండగకు కనీసం ఒకరోజు ముందే ఫిత్రా చెల్లిస్తే పేదలు సైతం పండగ చేసుకునే వీలుంటుంది. అప్పుడే పుట్టిన బిడ్డ మొదలు.. ఇంట్లో ఉన్న ప్రతి ఒక్కరి పేరున ఫిత్రా ఇవ్వాలి.

అల్లా ఇంటి ఆతిథ్యం ఎతెకాఫ్

ఎతెకాఫ్ అల్లా ఇంటి (మసీదు) ఆతిథ్యం వంటిది. రంజాన్‌లో దీనికెంతో ప్రాధాన్యం ఉంది. ఊర్లో ఒక్క వ్యక్తి కూడా ఎతెకాఫ్ ఉండకపోతే, ఆ ఊరిపై అల్లా కరుణా కటాక్షాలు ఉండవని పవిత్ర ఖురాన్ బోధిస్తోంది. ఎతెకాఫ్‌ను రంజాన్ చివరి పది రోజుల్లో పాటించాలి. ప్రాపంచిక జీవితానికి దూరంగా, వీలుపడిన రోజులు (కనీసం 24 గంటలు) మసీదులో అల్లా ధ్యానంలో గడపడమే ఎతెకాఫ్. అన్నింటినీ త్యాగం చేసి ఆధ్యాత్మికతతో ఉండే వానిపై అల్లాహ్ అత్యంత కరుణతో మొర ఆలకిస్తారని మౌల్వీలు అంటున్నారు.

రంజాన్ శుభాకాంక్షలు

జిల్లా ప్రజలకు కలెక్టర్ ప్రశాంతి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం రంజాన్ సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో పీజీఆర్ఎస్ రద్దు చేసినట్లు ప్రకటించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: కారు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన దివాన్‌చెరువు జాతీయరహదారిపై ఆదివారం తెల్లవారు జామున జరిగింది. పోలీసులు కథనం ప్రకారం దివాన్‌చెరువు కంకరగట్టు ప్రాంతానికి చెందిన సుంకర బాబూరావు (64) అదే గ్రామంలో శ్రీరామపురం రోడ్డులో కోల్డ్ స్టోరేజ్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజాము 4.30 గంటల సమయంలో జాతీయరహదారిపై ఉన్న టీటైమ్‌కు వెళ్లి టీతాగి శ్రీరామపురం రోడ్డులోకి వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతున్నాడు. ఈ లోగా అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో పైకి ఎగిరి కిందపడడంతో తలకు బలమైన గాయమై బాబూరావు మృతిచెందాడు. బాబూరావు సోదరుడు సుంకర త్రిమూర్తులు ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై సీహెచ్‌వీ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ చోరీ!

శంఖవరం: మండలంలోని కత్తిపూడి గ్రామ పంచాయతీకి చెందిన చెత్త తరలించే ట్రాక్టర్ మాయమైంది. అధికారులు దీనిపై మౌనంగా ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులకు, పాలకవర్గానికి సమాచారం లేకపోవడం గమనార్హం. ఆదివారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే పంచాయతీలో చెత్త వేసే తొట్టెను విడిచి ట్రాక్టర్‌ను మాత్రం పట్టుకుపోయారు. దీనిపై కార్యదర్శి భవానీ శంకర్‌ను ఫోన్ ద్వారా సంప్రదించినా స్పందనలేదు. సర్పంచ్ కొల్లు సత్తిబాబును వివరణ కోరగా ట్రాక్టర్ చోరీ విషయం తన దృష్టికి రాలేదని చెప్పారు.

హోరాహోరీగా ఎడ్ల పట్టు

- జిల్లా వ్యాప్తంగా 16 జట్లు పోటీ
- విజేతగా నిలిచిన చక్రద్వారబంధం ఎడ్లు
- తరువాతి స్థానాలను దక్కించుకున్న మూలస్థానం, మురమండ ఎడ్లు

కడియం: మండలంలోని మురమండ శివార్లలోని శ్రీ నందన్నబాబు ఆలయం వద్ద ఆదివారం ఉగాది పండగను పురస్కరించుకుని ఎడ్ల పట్టు ప్రదర్శన హోరాహోరీగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 16 జతల ఎడ్లు ఈ పోటీల్లో తలపడ్డాయి. రాజానగరం మండలం చక్రద్వారబంధానికి చెందిన ముంగర నాగేశ్వరరావుకు చెందిన ఎడ్ల జత 21.13 సెకన్లలో నిర్ణీత దూరం చేరుకుని విజేతగా నిలిచింది. ఆలాగే ఆలమూరు మండలం మూలస్థానానికి చెందిన మురమళ్ల రాంబాబు ఎడ్లజత 21.72 సెకన్లలో చేరి ద్వితీయ స్థానాన్ని, కడియం మండలం మురమండ గ్రామానికి చెందిన మిద్దే సురేష్‌కు చెందిన ఎడ్ల జత 22.60 సెకన్లలో నిర్ణీత దూరం చేరుకుని మూడో స్థానాన్ని దక్కించుకున్నాయి. పోటీలకు ముందు నందన్నబాబుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పోటీలో తలపడుతున్న ఎడ్ల జత

అనంతరం పోటీలను ప్రారంభించారు. టీడీపీ నాయకుడు డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ తదితరులు పోటీలను తిలకించారు. ఆలయ నిర్వాహకులు మొగలపు చిన్న ఆధ్వర్యంలో యేటా ఉగాది రోజున ఎడ్ల పట్టు ప్రదర్శ నిర్వహిస్తున్నారు. అదే విధంగా ఈ యేడాది కూడా ఏర్పాటు చేశారు. అలాగే దాతల సహకారంతో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. కడియం పోలీసుల ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరక్కుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

అనుమానం.. ఆపై మద్యం మత్తులో భార్య హత్య

- తీర ప్రాంతం కొత్తపేటలో భర్త ఘాతుకం

తొండంగి: మద్యం మత్తులో భార్యను హతమార్చిన ఘటన మండలం యర్రయ్యపేట పంచాయతీ కొత్తపేటలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాకినాడ దుమ్ములపేటకు చెందిన గోసల దారకొండకు యర్రయ్యపేటకు చెందిన చొక్కా భూలోకం, కొండమ్మల రెండో కుమార్తె చొక్కా పద్మ(34)తో సుమారు పదిహేనేళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్నేళ్లుగా ఆ భార్యాభర్తలు కొత్తపేటలోనే ఉంటున్నారు. వీరికి కుమారుడు సిద్ధు, కుమార్తె లాస్య ఉన్నారు. దారకొండ మద్యానికి బానిసై అనుమానంతో తరచూ భార్యను వేధిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో గ్రామంలోనే చిన్న కిరాణా కొట్టు పెట్టుకుని పద్మ తన కుటుంబాన్ని పోషిస్తోంది. శనివారం రాత్రి కొత్త అమావాస్య సందర్భంగా డీజే చూసేందుకు వెళ్లిన పద్మను ఇంటికి రమ్మని దారకొండ కుటుంబసభ్యులతో కబురు పంపాడు. ఇంటి వచ్చిన పద్మతో దారకొండ వాగ్వివాదానికి దిగి ఆమెను హతమార్చాడు. ఎవరికి అనుమానం రాకుండా గోనె సంచి తొడిగి మంచం కింద దాచి దానికి చాప అడ్డుపెట్టాడు. కొంత సేపటికి కుటుంబసభ్యులు వచ్చి ఆమె కోసం ప్రశ్నించగా ఎక్కడికో వెళ్లిపోయిందని చెప్పడంతో వారు చుట్టుపక్కల వెతికారు. ఎక్కడా ఆచూకీ దొరకకపోవడంతో మళ్లీ ఇంటికి వచ్చి మంచం కింద విగతజీవిగా ఉన్న పద్మను గుర్తించారు. ఈ లోపే దారకొండ పరారయ్యాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వాకదారిపేటలో ఉన్న దారకొండను అదుపులోకి తీసుకున్నారు. సంఘటనా స్థలాన్ని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, ఎస్సై జగన్మోహన్‌రావు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. తల్లి మృతి చెందడం, తండ్రి జైలుకు వెళ్లడంతో పిల్లలు సిద్ధూ, లాస్య జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయి. పద్మ మృతితో ఆమె తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీమున్నీరవుతున్నారు.


పద్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీహరి రాజు, తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు

పర్యావరణ రక్షణతో మానవ మనుగడ

పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా

పిఠాపురం: మానవుడు తన స్వార్థం కోసం పంచభూతాలను కలుషితం చేసి, వాటిలో సమతుల్యత పాడుచేసి ప్రకృతి వైపరీత్యాలకు కారణమవుతున్నాడని, పర్యావరణాన్ని రక్షించుకుంటేనే మానవ మనుగడ సాధ్యమని శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఏర్పాటు చేసిన సభలో ఆయన అనుగ్రహ భాషణం చేశారు. పంచభూతాలతో కూడిన ప్రకృతి ద్వారా భూమిపై జీవించడానికి భగవంతుడు ఇచ్చిన అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఉగాది రోజున పంచాంగ శ్రవణం భవిష్యత్‌లో జరగబోయే అనేక విషయాలతో పాటుగా విపత్తులను గురించి కూడా సూచిస్తుందని, మేల్కొని రక్షణ చర్యలు చేపడితే పర్యావరణాన్ని కాపాడు కోవచ్చునని తెలిపారు. ఉగాది పచ్చడిలోని షడ్రుచుల సమ్మేళనం వంటిదే జీవితమని, జీవన గమనంలో కష్ట, సుఖాలను సమభావనతో స్వీకరిస్తేనే జీవిత


సభలో ప్రసంగిస్తున్న ఉమర్ ఆలీషా


ప్రవచనాన్ని వింటున్న సభ్యులు

పరమార్థం అర్థమవుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మూడు మొక్కలునాటి సంరక్షించాలని, నాటిన ప్రతి మొక్క ఒక్కో ఆక్సిజన్ సిలిండర్‌తో సమానమని ఆయన అన్నారు. అనంతరం ప్రముఖ జ్యోతిష శాస్త్ర నిపుణురాలు కేవీవీఎస్ శారద సభలో పంచాంగ పఠనం చేశారు. ముఖ్య అతిథులు గీతావదాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు, ఆక్టి ఇన్ఫోటెక్ డైరెక్టర్ కమల్ బెయిద్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ సభ్యుడు కృష్ణ ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

అతివేగంతో అదుపు తప్పి..

- విద్యుత్ స్తంభాన్ని, వెంటనే టూ వీలర్‌ను ఢీకొట్టిన కారు
- ఐదుగురికి గాయాలు
- రాజమహేంద్రవరానికి ఇద్దరి తరలింపు
- బాలుడి పరిస్థితి విషమం!


గాయాలతో రాంబాబు

మండపేట: స్థానిక బైపాస్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. రావులపాలెం నుంచి కాకినాడ వెళ్తున్న సుజుకీ ఎర్టిగా కారు వేగంగా వస్తూ ఏడిద బైపాస్ జంక్షన్ వద్ద అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని, ఆ వెంటనే టూ వీలర్‌ను ఢీకొంది. దీంతో కపిలేశ్వరపురం మండలం నల్లూరు గ్రామానికి చెందిన పాడగట్లపల్లి రాంబాబు తన కుమారుడు హేమంత్ గాయపడ్డారు. అలాగే కారు


మండపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు లక్ష్మి

మీదకు దూసుకు వస్తుండడంతో అక్కడే టీ దుకాణం వద్ద కుర్చీలో కూర్చుని టీ తాగుతున్న కురుపూడి శ్రీనివాస్ ఎగిరి పడగా, దుకాణం నిర్వాహకురాలైన మజ్జి లక్ష్మి కాలు, తలకు గాయాలయ్యాయి. వీరిని 108 లో స్థానిక ప్రభుత్వాసుపత్రికి చేర్చారు. తీవ్రంగా గాయపడిన హేమంత్, కారు డ్రైవర్‌ను అంబులెన్స్‌లో రాజమండ్రికి తరలించారు. హేమంత్ పరిస్థితి విషమంగా వున్నట్లు తెలిసింది. పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి అనంతరం ఆసుపత్రిలో వారి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కళారంగానికి సీఆర్సీ సేవలు ఎనలేనివి

- సినీ నటులు తనికెళ్ల తదితరుల ప్రశంస
- అట్టహాసంగా ఉగాది ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభం

రావులపాలెం: భారతీయ సంస్కృతి సంప్రదాయాల్లో కళారంగానికి ఒక ప్రత్యేక స్థానం ఉందని, అంతరించిపోతున్న కళలను, కళాకారులను ప్రోత్సహించేందుకు కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్ (సీఆర్సీ) కాటన్ కళాపరిషత్ చేస్తున్న కృషి అభినందనీయమని సినీ నటులు తనికెళ్ల భరణి, గౌతంరాజు, గుండు సుదర్శన్, జోగినాయుడు, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలోని సీఆర్సీ కాటన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో 25వ ఉగాది ఆహ్వాన నాటికల పోటీలను ఆదివారం వారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్య అతిథిగా హాజరై సీఆర్సీ కళా సేవను కొనియాడారు.

ఈ సందర్భంగా సీఆర్సీ ఉగాది పురస్కారాన్ని రామచంద్రపురానికి చెందిన చింతా గిరిబాలకు, సీఆర్సీ కాటన్ కళా పురస్కారాన్ని మేకప్ ఆర్టిస్ట్ అడివి శంకరరావుకు అందజేశారు.

కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ఈ సందర్భంగా సీఆర్సీ, సీఆర్సీ ఓల్డేజ్ హోమ్ నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకారం జరిగింది. సీఆర్సీ అధ్యక్షుడిగా తాడి నాగమోహనరెడ్డి, కార్యదర్శిగా నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, పరిషత్ డైరెక్టర్‌గా కె.సూర్య, ఉపాధ్యక్షుడిగా చిన్నం తేజారెడ్డి, ట్రెజరర్‌గా కొవ్వూరి నరేష్‌కుమార్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా దండు సూరిబాబురాజు, తొమ్మిది మంది డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే ఓల్డేజ్ హోమ్ అధ్యక్షుడిగా వేగేశ్న రామరాజు, ఉపాధ్యక్షుడిగా నందం సత్యనారాయణ, కార్యదర్శిగా గొలుగూరి వెంకటరెడ్డి, జాయింట్ సెక్రటరీగా సీహెచ్ గోపాలకృష్ణ, కోశాధికారిగా నల్లమిల్లి సూర్యనారాయణరెడ్డి, మరో పది మంది డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు.


నాటిక పోటీల ప్రారంభ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ నటుడు తనికెళ్ల భరణి తదితర నట ప్రముఖులు

ఆలోచింపజేసిన నాటికలు

ఉగాది ఆహ్వాన నాటికల పోటీల్లో భాగంగా మొదటి రోజు రెండు నాటికలను ప్రదర్శించారు. తాడేపల్లికి చెందిన అరవింద ఆర్ట్స్ బృందం విడాకులు కావాలి నాటిక ఆకట్టుకుంది. గంగోత్రి సాయి దర్శకత్వం వహించగా, వల్లూరి శివప్రసాద్ రచన ప్రేక్షకులను ఆలోచింపజేసింది. అలాగే గుంటూరుకు చెందిన అమరావతి ఆర్ట్స్ బృందం చిగురు మేఘం నాటిక వేమూరి హరిబాబు దర్శకత్వం, కావూరి సత్యనారాయణ రచనలో ప్రదర్శించారు. సందేశాత్మకంగా సాగిన నాటిక ప్రేక్షకుల మన్ననలు అందుకుంది.


విడాకులు కావాలి నాటికలో సన్నివేశం

ఉగాది అందరికీ శుభాలు ఇవ్వాలి

పరిపూర్ణానంద స్వామి


రమణయ్యపేట శ్రీపీఠంలో పంచాంగ పఠనం చేస్తున్న పరిపూర్ణానంద స్వామి

కాకినాడ రూరల్: విశ్వావసు నూతన సంవత్సరం ఉగాది అందరికీ శుభాలు ఇవ్వాలని పరిపూర్ణానంద స్వామి ఆకాంక్షించారు. స్థానిక రమణయ్యపేట పీఠంలో జరిగిన ఉగాది వేడుకల్లో ఆయన పంచాంగ శ్రవణం చేశారు. తెలుగు నూతన సంవత్సరంలో సుందరేశ్వర సమేత ఐశ్వర్యాంబిక అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరారు. ప్రతి ఒక్కరూ భక్తిభావంతో ముందుకు సాగాలన్నారు. భమిడి చారిటబుల్ ట్రస్ట్ ప్రచురించిన పంచాంగం ప్రతులను పరిపూర్ణానంద స్వామి ఆవిష్కరించారు. కార్యక్రమంలో భమిడి ట్రస్ట్ చైర్మన్ శివమూర్తి రమాదేవి, న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఉగాది వేడుకల్లో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, కవి డాక్టర్ వేదుల శిరీష పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అడబాల రత్నప్రసాద్ ఆధ్వర్యంలో వృద్ధులకు నూతన వస్త్రాలు అందజేశారు.